క్లుప్తంగా

మంత్రిని కలిసిన కృష్ణపట్నం పోర్టు సీఐ



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఐ

ముత్తుకూరు: కృష్ణపట్నం పోర్టు సర్కిల్ సీఐగా కె.వెంకటరెడ్డి నియమితులయ్యారు. ఆయన బుధవారం ముత్తుకూరులోని సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరులోని క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వెంకటరెడ్డి గతంలో కృష్ణపట్నం పోర్టు ఎస్సైగా విధులు నిర్వహించారు.

వరి పైరు పరిశీలన



వరి పైరును పరిశీలిస్తున్న అధికారులు

ముత్తుకూరు: మండలంలోని వల్లూరులో సాగులో ఉన్న వరి పైరును ఇందుకూరుపేట ఏడీఏ రాజ్‌కుమార్, ఇఫ్కో మేనేజర్ లక్ష్మీనారాయణ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ సాధారణ పద్ధతిలో నాట్లు వేసే విధానం కంటే డ్రమ్ సీడర్ ద్వారా సాగు చేసే వరి చాలా మెరుగ్గా ఉంటుందన్నారు. ఈ ప్రాంతంలో డ్రమ్ సీడర్ పద్ధతిలో 30 ఎకరాలు, మరో విధంగా 50 ఎకరాల్లో వరి సాగు చేశారన్నారు. రైతులకు ఆ పొలాలను చూపించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జోత్స్నరాణి, రైతులు దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, పోచారెడ్డి చెంగారెడ్డి, వీఏఓ మస్తానమ్మ పాల్గొన్నారు.

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం



ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవార్లు

పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం శ్రీనివాసుని కల్యాణం కమనీయంగా జరిగింది. ఆదాల శ్రీనివాసులురెడ్డి – మాధవి దంపతులు ఉభకర్తలుగా వ్యవహరించారు. కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు.

ఏసీ నగర్ కాలనీలో డ్రెయిన్ నిర్మాణం



సైడ్ డ్రెయిన్ పనులు

పొదలకూరు: పట్టణంలోని ఏసీ నగర్ కాలనీలో బుధవారం సైడ్ డ్రెయిన్ నిర్మాణ పనులు చేపట్టారు. గడప గడకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆ కాలనీలో పర్యటించిన సందర్భంగా ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి ద్వారా కాలనీవాసులు సైడ్ డ్రెయిన్ అవసరమని విజ్ఞప్తి చేశారు. వెంటనే స్పందించిన మంత్రి కాలువ నిర్మాణం కోసం రూ.5 లక్షల నిధులను మంజూరు చేయించారు. అంతకుముందు కాలనీకి గ్రావెల్ రోడ్డు కూడా సక్రమంగా లేకపోవడంతో మంత్రి చొరవ తీసుకుని రూ.20 లక్షల అంచనా విలువలతో సిమెంట్ రోడ్డు ఏర్పాటు చేయించారు. దీంతో కాలనీవాసులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం

ఇందుకూరుపేట: మండలంలోని ముదివర్తిపాళెం నుంచి బుధవారం ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నామని సెబ్ సీఐ బాలకృష్ణ తెలిపారు. అదే గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ రవిచంద్రను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు వివరించారు. ఈ దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ బాబు సతీష్, కానిస్టేబుల్ పెంచలయ్య పాల్గొన్నారు.

‘సంపూర్ణ పోషణ’తో కొండంత అండ

‘వైఎస్సార్ సంపూర్ణ పోషణ’ కార్యక్రమం ద్వారా గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం కొండంత అండగా నిలిచింది. టేక్ హోం రేషన్‌ను మండలాల్లో బుధవారం పండగ వాతావరణంలో ప్రారంభించారు. ఆయా కిట్లలో అనేక సరుకులుంటాయి. దీంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- టేక్ హోం రేషన్ పంపిణీ ప్రారంభం
- గర్భిణులు, బాలింతల ఆనందం



మనుబోలు: వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందుకున్న మహిళలు



వెంకటాలచం: కిట్ అందజేస్తున్న సీడీపీఓ విజయలక్ష్మి



బుచ్చిరెడ్డిపాళెం: మహిళలకు కిట్లు అందజేసిన అధికారులు



కొడవలూరు : టేక్ హోం రేషన్‌ను ప్రారంభించిన డాక్టర్ లత



కోవూరు మండలంలో..

వెంకటాచలం: టేక్ హోం రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని మండల కేంద్రమైన వెంకటాచలంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రారంభించారు. నెలకు సరిపడా బియ్యం, పప్పు, గుడ్లు, పాలు తదితరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి మాట్లాడుతూ పౌష్టికాహారం గురించి గర్భిణులు, బాలింతలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మహిళల్లో రక్తహీనత నివారణకు ప్రభుత్వం సరుకులు ఇస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మందా కవిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సీతాలక్ష్మి, భాగ్యలక్ష్మి, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

పూడిపర్తిలో..

మండలంలోని పూడిపర్తి గ్రామంలో గర్భిణులు, బాలింతలకు టేక్ హోం రేషన్‌ను ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ డక్కలి రమణయ్య చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కామాక్షమ్మ, ఏఎన్‌ఎం సులోచన పాల్గొన్నారు.

రక్తహీనతకు చెక్

బుచ్చిరెడ్డిపాళెం: వైఎస్సార్ సంపూర్ణ పోషణ ద్వారా అందించే పౌష్టికాహారంతో రక్తహీనతకు చెక్ పెట్టవచ్చని ఎంపీడీఓ శ్యామ్ అన్నారు. మండల కేంద్రమైన బుచ్చిరెడ్డిపాళెంలోని ఎంపీడీఓ కార్యాలయంలో టేక్ హోం రేషన్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు బాలింతలు, గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాల వద్ద భోజనం పెట్టేవారని తెలిపారు. అయితే చాలామంది దీనిని సద్వినియోగం చేసుకోకపోవడంతో రక్తహీనతకు గురవుతున్నట్లు గుర్తించిన ప్రభుత్వం ఇంటికే పౌష్టికాహార కిట్లతోపాటు, నెలకు సరిపడా బియ్యం, నూనె, పాలు, కోడిగుడ్లు, పప్పును అందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ దిలీప్, సూపర్‌వైజర్లు శకుంతల, ఉమ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో..

ముత్తుకూరు: మండలంలోని మామిడిపూడి అంగన్‌వాడీ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పద్మనాభరెడ్డి గర్భిణులకు సంపూర్ణ పోషణ కిట్‌లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం పేద గర్భిణులు, బాలింతలకు వరమని చెప్పారు. కార్యక్రమంలో సచివాలయం కన్వీనర్ గౌస్‌బాషా, శ్రీకాంత్, ప్రసాద్, రామారావు, మహిళా పోలీస్ గాయత్రి, టీచర్ పావని, ఉప సర్పంచ్ సులోచన పాల్గొన్నారు.

ఇంటికే కిట్లు

కొడవలూరు: బాలింతలు, గర్భిణులు ఇంటికే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు తీసుకెళ్లేలా ప్రభుత్వం ‘టేక్ హోం రేషన్’ అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని యల్లాయపాళెం వైద్యాధికారిణి పి.లత తెలిపారు. మండలంలోని యల్లాయపాళెం ప్రధాన అంగన్‌వాడీ కేంద్రంలో ఈ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బియ్యం, పప్పు, నూనెలతో కూడిన సంపూర్ణ పోషణ కిట్లను ఇంటికే అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. త్వరలోనే బాలామృతాన్ని కూడా 6 నెలల నుంచి మూడేళ్లలోపు పిల్లలకు ఇంటికే అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి, మహిళా పోలీస్ బి.మేరీ హెబ్సిబా, హెచ్‌వీ మేరీ ఎలిజిబెత్, ఏఎన్‌ఎంలు సుకన్య, వైద్య సిబ్బంది శ్రీలత, నూర్జహాన్, నరహరి, నాయకుడు మాబాషా పాల్గొన్నారు.

గ్రామాల్లో..

పొదలకూరు: మండలంలోని మొగళ్లూరు, నావూరు అంగన్‌వాడీ కేంద్రాల్లో టేక్ హోం రేషన్ పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో మొగళ్లూరు, నావూరుపల్లి సర్పంచ్‌లు ఆకుల లక్ష్మి, గాలం వెంగయ్య, ఎం.వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ టీచర్లు బుజ్జమ్మ, స్వర్ణలత, వసుధ, మాధవి పాల్గొన్నారు.

తల్లీబిడ్డల ఆరోగ్యం కోసం..

మనుబోలు: తల్లీబిడ్డల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం పౌష్టికాహారం అందజేస్తోందని ఎంపీపీ, జెడ్పీటీసీలు గుండాల వజ్రమ్మ, చిట్టమూరు అనితమ్మ అన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమంలో భాగంగా మనుబోలు మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో టేక్ హోం రేషన్ పంపిణీని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషక విలువలున్న ఆహారం అందజేస్తున్నామన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రమణమ్మ, ఆదినారాయణమ్మ మాట్లాడుతూ సంపూర్ణ పోషణలో భాగంగా వివిధ సరుకులు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాజేశ్వరమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు చిట్టమూరు అజయ్‌రెడ్డి, దువ్వూరు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- మండలంలోని బద్దెవోలు, పిడూరుపాళెం అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అలాగే సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశామని అంగన్‌వాడీలు దొరసానమ్మ, ఉమామహేశ్వరి తెలిపారు. కార్యక్రమంలో బద్దెవోలు సర్పంచ్ శశికుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఏడెం మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- **కోవూరు:** కోవూరు పెళ్లకూరు కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో సంపూర్ణ పోషణ కిట్లను డీఏఏపీ చైర్మన్ దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ పి.రాధాకృష్ణారెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పార్వతి, జెడ్పీటీసీ శ్రీలత, సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, బొందిలి కార్పొరేషన్ చైర్మన్ కిశోర్‌సింగ్, ఎంపీడీఓ శ్రీహరి, మండల సచివాలయాల కన్వీనర్ ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక, ఎంపీటీసీ సభ్యులు మహాలక్ష్మి, వేణుగోపాల్, నాయకులు పాల్గొన్నారు.



ముత్తుకూరు: కిట్ అందజేస్తూ..



పొదలకూరు మండలంలో..



పొదలకూరు మండలంలోని నావూరుపల్లిలో..



మనుబోలు : కిట్ అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

నేడు 17వ వార్డులో గడప గడపకు..

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని 17వ వార్డులో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ కన్వీనర్లు చెర్లో సతీష్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జునరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి పాల్గొని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించడంతోపాటు సమస్యలను తెలుసుకుంటారన్నారు. అలాగే 90 వేల ఇళ్ల సందర్శన పూర్తయిన సందర్భంగా కేక్‌ను కట్ చేసి సంబరాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని వారు కోరారు.

పంట వివరాల నమోదు

కొడవలూరు: ఖరీఫ్ వరి సాగు చేస్తున్న ప్రతి రైతు విధిగా వివరాలు నమోదు చేయించుకోవాలని ఏఓ సీహెచ్‌ఎస్ లక్ష్మి కోరారు. కొడవలూరులో జరుగుతున్న పంట వివరాల నమోదు కార్యక్రమాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకూ కేవలం 38 శాతం మంది రైతులు మాత్రమే వివరాలు నమోదు చేయించుకున్నట్లు చెప్పారు. కొందరు అందుబాటులో లేకపోవడంతో జాప్యం జరుగుతోందని చెప్పారు. పంట వివరాల నమోదు చేసుకోవడంతోపాటు ఈకేవైసీ కూడా చేయించుకున్న రైతులు మాత్రమే రుణాలు, వ్యవసాయ శాఖ రాయితీలు, నష్ట పరిహారం, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయాలకు అర్హులవుతారన్నారు. అందువల్ల ప్రతి రైతు వివరాలు ఇవ్వాలన్నారు. ఏఓ వెంట వీఏఏ జి.కవిత ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

కోవూరు: రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడిన ఘటన కోవూరు మండలం గంగవరం కాలువ వద్ద బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాళెం మండలం చల్లాయపాళెం గ్రామానికి చెందిన తమ్మిరెడ్డి శివప్రసాద్ తన బంధువు తాంద్ర హరికిరణ్‌తో నెల్లూరులోని ఓ సూపర్ స్పెషాలిటీ వైద్యశాలలో చికిత్స నిమిత్తం బైక్‌పై వెళ్తున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యలో మూత్ర విసర్జన కోసం కోవూరు మండలం గంగవరం కాలువ వద్ద ఆగారు. అదే సమయంలో బుచ్చి వైపు నుంచి నెల్లూరు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం శివప్రసాద్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో శివప్రసాద్ తీవ్రంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న కోవూరు ఎస్సై దాసరి వెంకటేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ముమ్మరంగా పింఛన్ల పంపిణీ



బుచ్చిరెడ్డిపాళెం: పల్లాప్రోలులో పర్రి రమణయ్య వేలిముద్రలు తీసుకుంటున్న వలంటీర్ లోకేశ్



టీపీగూడూరు: నెల్లూరులో పొన్నూరు శేషయ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ఖాదర్ మొహిద్దీన్

బుచ్చిరెడ్డిపాళెం: వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ ప్రక్రియ మండలంలో కొనసాగుతోంది. రెండో రోజైన బుధవారం వలంటీర్లు లబ్ధిదారుల వద్దకు వెళ్లి నగదు అందజేశారు.

- **తోటపల్లిగూడూరు:** మండలంలోని నరుకూరు గ్రామానికి చెందిన పొన్నూరు శేషయ్య కొన్నేళ్లుగా వృద్ధాప్య పింఛన్ పొందుతున్నాడు. ఆయన అనారోగ్యానికి గురై 20 రోజులుగా నెల్లూరు అమృత చెస్ట్ సెంటర్‌లో చికిత్స పొందుతున్నాడు. సమాచారం అందుకున్న వలంటీర్ ఖాదర్ మొహిద్దీన్ బుధవారం ఆస్పత్రికి వెళ్లి శేషయ్యకు పింఛన్ అందజేశాడు.
- **కోవూరు:** కోవూరు సచివాలయం–1 పరిధిలోని దాసరిపాళేనికి చెందిన కె.పార్వతి అనారోగ్యం కారణంగా నెల్లూరులోని బొల్లినేని హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో వలంటీర్ పి.జ్యోష్ణ బుధవారం ఆస్పత్రికి వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు.



కోవూరు: వేలిముద్ర తీసుకుంటున్న వలంటీర్

నెరవేరిన గ్రామస్తుల కల



పొడమేకలకండ్రిగకు నిర్మించిన తారురోడ్డు



రోడ్డును ప్రారంభించిన మంత్రి కాకాణి (ఫైల్)

- దశాబ్దాలుగా తారురోడ్డు కోసం ఎదురుచూపు
- గత ప్రభుత్వంలో కాగితాలకే పరిమితం

పొదలకూరు: మండలంలోని ఆల్తుర్తి పంచాయతీ పొడమేకలకండ్రిక గ్రామస్తుల కల నెరవేరింది. గత ప్రభుత్వ హయాంలో ఇక్కడ రోడ్డు నిర్మాణం కాగితాలకే పరిమితమైంది. ఈ తరుణంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి రూ.1.38 కోట్లు విడుదల చేయించగా పనులు జరిగాయి. ఇటీవల గడప గడకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రోడ్డును ఆయన ప్రారంభించారు. ఒకప్పుడు గ్రామానికి వెళ్లాలంటే సరైన రోడ్డు సౌకర్యం ఉండేది కాదు. ఇక్కడ నివాసాలు విసిరేసినట్లు ఉండడం వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఓటింగ్ జరుగుతుండడంతో గత ప్రభుత్వాలు రోడ్డు నిర్మాణానికి అందిన విజ్ఞప్తులను బుట్టదాఖలు చేశాయి. టీడీపీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు రోడ్డు నిర్మాణానికి సంబంధించి మంజూరు కాగితాలను గ్రామస్తులకు చూపించి ఓట్లు దండుకునేందుకు ప్రయత్నించింది. అయితే ఆ గ్రామస్తులంతా వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలిచారు. కాకాణి చొరవతో రోడ్డు నిర్మాణం జరిగింది. ఇచ్చిన హామీని నెరవేర్చిన మంత్రిని ఇటీవల గ్రామస్తులు ఘనంగా సత్కరించారు.

చెముడుగుంటలో మంత్రి పర్యటన నేడు

వెంకటాచలం: మండలంలోని చెముడుగుంట పంచాయతీ కుంకుమపూడి గ్రామంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం పర్యటిస్తారని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మందల వెంకటశేషయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు గ్రామానికి చేరుకుని లబ్ధిదారులకు స్వామిత్వా ప్రాపర్టీ కార్డులు పంపిణీ చేస్తారని తెలియజేశారు.

తల్లిపాల వారోత్సవాలు

కొడవలూరు: మండల కేంద్రమైన కొడవలూరు హరిజనవాడలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.నిర్మల మాట్లాడుతూ తల్లి పాలలో వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటుందన్నారు. బిడ్డకు ఆరునెలల వరకూ విధిగా తల్లిపాలనే పట్టించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త కె.నాగరాజా, సహాయకురాలు కె.ప్రవల్లిక, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

కామాక్షినగర్‌లో నగదు, బంగారం చోరీ



చోరీ జరిగిన ఇల్లు

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని కామాక్షినగర్‌లో నివాసం ఉంటున్న రమాదేవి అనే మహిళ ఇంట్లో చోరీ జరిగిన ఘటన బుధవారం వెలుగు చూసింది. బాధితురాలు, పోలీసుల కథనం మేరకు.. రమాదేవి వలంటీర్‌గా పని చేస్తోంది. బుధవారం ఉదయం 10 గంటల సమయంలో ఆమె బంధువులకు ఇంటికి వెళ్లింది. సాయంత్రంగా ఇంటికి వచ్చింది. అప్పటికే తలుపులు తీసి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూసింది. బీరువా తలుపు తీసి ఉండగా.. అందులోని వస్తువులు కింద పడిపోయి ఉన్నాయి. ఒక రింగ్, జత బంగారు కమ్మలతోపాటు సుమారు రూ.20 వేల నగదు చోరీకి గురైనట్లు రమాదేవి గుర్తించింది. దీంతో పోలీస్‌లకు ఫిర్యాదు చేయగా వారు దర్యాప్తు చేస్తున్నారు.

వినూత్న ప్రాజెక్ట్‌లను తయారు చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి

నెల్లూరు (టౌన్): విద్యార్థులతో ప్రజలకు ఉపయోగపడే విధంగా వినూత్న ప్రాజెక్ట్ నమూనాలను తయారు చేయించి ఇన్‌స్పైర్‌లో ప్రదర్శించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. నగరంలోని ఆచారివీధిలోని కృష్ణచైతన్య జూనియర్ కళాశాలలో నెల్లూరు డివిజన్ సైన్స్ ఉపాధ్యాయులకు ఇన్‌స్పైర్‌పై బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఇన్‌స్పైర్ కార్యక్రమం చాలా గొప్పదని, అన్ని పాఠశాలల విద్యార్థులు ప్రాజెక్ట్‌లను ప్రదర్శించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకుని విజయవంతం చేయాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ నెల 15లోపు ఇన్‌స్పైర్ నామినేషన్లను పూర్తి చేయాలన్నారు. ప్రతి ఉన్నత పాఠశాల నుంచి ఐదు నామినేషన్లు, ప్రాథమికోన్నత పాఠశాల నుంచి మూడు నామినేషన్లు ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్పీలు తాతాచార్యులు, రాములు, జోయల్, ప్రభాకర్, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

6న సంగీత, నృత్య పోటీలు



ఆహ్వానపత్రికలను ఆవిష్కంచిన సుబ్బారావు, రాయప్ప తదితరులు

నెల్లూరు(బృందావనం): పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్‌లో ఈ నెల 6న ఏవీకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో సంగీత, నృత్య పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు కేతా సుబ్బారావు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఆహ్వానపత్రికలను స్వతంత్రపార్కులో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్ధమాన కళాకారులను ప్రోత్సహించాలనే సంకల్పంతో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం 3 గంటల నుంచి జరిగే పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి నగదు ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేస్తామని చెప్పారు. వివరాలకు 77299 42543 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. వివిధ సంస్థల నిర్వాహకులు ఎస్ మురళీమోహన్‌రావు, ఏ రాయప్ప, డాక్టర్ సుబ్బారెడ్డి, శ్రీమన్నారాయణ, ఆర్ రఘు, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని గౌతమ బుద్ధ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అరవ రాయప్ప పిలుపునిచ్చారు. నగరంలోని స్వతంత్ర పార్కులో గౌతమ బుద్ధ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేటర్ వేలూరు మహేష్ చేతుల మీదుగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయప్ప మాట్లాడుతూ బుద్ధుడి ఆశయాలను ఆచరణలో పెట్టేందుకు లక్ష మొక్కలు నాటాలనే ఆశయంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు రాచపాళెం రఘు, ప్రధాన కార్యదర్శి కేవీ రమణయ్య, ట్రెజరర్ పళని, డిస్ట్రిక్ట్ క్యాబినెట్ ట్రెజరర్ శ్రీమన్నారాయణ, మురళీ మోహన్‌రాజు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణస్వామికి విశేష పూజలు



నెల్లూరు(బృందావనం): అధిక శ్రావణ మాస పూర్ణిమ సందర్భంగా సంతపేట, బ్రాహ్మణవీధిలోని వ్యాసరాజ మఠం ప్రాంగణంలోని రమాసత్యనారాయణస్వామి మందిరంలో బుధవారం విశేష పూజలు నిర్వహించారు. కంభాలూరు శ్రీవత్సాచార్ ఆధ్వర్యంలో ఉత్తరాది, వ్యాసరాజ, రాఘవేంద్రస్వామి మఠాలకు చెందిన 36 మంది సుధాపండితులు భగవద్గీత, న్యాయసుధా, శ్రీమద్ ఆచార్యులు రచించిన 32 గ్రంథాలను పారాయణం చేశారు. అనంతరం పవన హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వ్యాసరాజమఠం మేనేజర్ తడకపల్లి రవీంద్రబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.